క్లుప్తంగా

శివలింగంపై ప్రసరించిన సూర్యకిరణాలు



శివుడికి అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు భాస్కరయ్య

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీరామేశ్వరస్వామి ఆలయంలోని శివలింగంపై సోమవారం ఉదయం సూర్యుడి లేత కిరణాలు ప్రసరించాయి. ఉదయం 6.40 నుంచి 7 గంటల వరకు ఆలయంలోని శివలింగంపై సూర్య కిరణాలు పడటంతో పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల భాస్కయ్యా మాట్లాడుతూ సూర్యకిరణాలు శివుడిపై ఏటా ఉత్తరాయణంలో పాల్గుణ మాసం, దక్షిణాయంలో భాద్రమాసం మూడో సోమవారం రెండుమార్లు పడతాయన్నారు. ఆ సమయంలో శివుడికి పూజలు చేస్తే మేలు జరుగుతుందన్నారు.

ముచ్చట్ల క్షేత్రంలో పూజలు



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన శైవ పుణ్యక్షేత్రం ముచ్చట్ల భ్రమరాంభసమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భాద్రపద సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. బుగ్గానిపల్లె గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయునిపేట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుధాకర్‌శెట్టి సోమవారం తెలిపారు. మూడు రోజులు భాగవతం, రామాయణం, మహాభారతంపై ఉపన్యాసం ఉంటుందన్నారు. చివరి రోజు గోపూజ, మహిళలతో కుంకుమార్చన ఉంటుందన్నారు.

నేటి నుంచి శ్రీహట్టిమునిస్వామి ఆరాధన

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో ఉన్న శ్రీహట్టిమునిస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మంగళవారం స్వామి వారికి అభిషేకం, గీతా పారాయణం, బుధవారం పుష్పార్చన, ఆధ్యాత్మిక సభ, గ్రామోత్సవం, భజన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సూచనలు, సలహాలతో పాటు సమస్యలు ఉంటే 9959225795 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.

కళాప్రపూర్ణకు ఆత్మీయ సన్మానం



దత్తాత్రేయశర్మను సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

డోన్: ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గాయత్రీ పీఠం వ్యవస్థాపకులు శతావధాని, కళాప్రపూర్ణ గండ్లూరి దత్తాత్రేయశర్మకు సోమవారం ఆత్మీయ సత్కారం జరిగింది. ఇటీవల విశాఖపట్నంలో కుర్తాళం సిద్దేశ్వరానంద భారతి స్వామి వారిచే అవధాన పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా దత్తాత్రేయ శర్మను ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శాలిని, ఆర్‌టీసీ శాంతిల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈయన కొప్పవరపు కవుల దైవసంకల్పం అనే కావ్యాన్ని రచించడంతో డోన్ పట్టణ పేరు ప్రఖ్యాతులను దేశం నలుదిశలా వ్యాపింపజేశారని శాలిని, శాంతిలు అభినందించారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ముడియాల శైలజ, అనంతలక్ష్మి, సరో జమ్మ, ఝాన్సీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్యాపిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేద, మధ్య తరగతి ప్రజలకు వరం లాంటిదని వైద్యాధికారులు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ, రాజశేఖర్, జయలక్ష్మి తదితరులు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నాలుగో సచివాలయం పరిధిలోని దాదాపు 530 మంది వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 15 మందిని డోన్, కర్నూలు తదితర ఆసుపత్రులకు డాక్టరుల సిఫారసు చేశారు. వైద్య పరీక్షల అనంతరం వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైద్య శిబిరానలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొండమనాయునిపల్లెలో ..

అవుకు: ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో డాక్టర్లు వినోద్ కుమార్, యమున, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ చిన్న లింగన్న, జనరల్ సర్జన్ రాజేష్‌లు 375 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన మెడికల్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బీపీ, షుగర్, గుండె తదితర పరీక్షలను వైద్యులు చేసి, కావాల్సిన మందులను రోగులకు పంపిణీ చేశారు. దాదాపు 95 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. సర్జరీలు అవసరమైన 40 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కొండమనాయునిపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



రోగికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి వాణిశ్రీ

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ విష్ణునారాయణ

అవుకు: వీఆర్‌లో ఉన్న విష్ణునారాయణను అవుకు ఎస్‌ఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

యువతి అదృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన బాల బుడ్డి హుసేన్ సాహెబ్ కుమార్తె షేక్ జహరాబీ ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా యువతి ఆచూకీ లేకపోవడంతో తన కుమార్తె కనిపించడం లేదని తండ్రి సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలోని శివపార్వతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాకారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలారూపంలో శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ముస్తాబు చేసి పల్లకీ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలని ఎస్‌ఐ కల్పన సూచించారు. కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్తున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

అన్నదానం



రోగులకు, గర్భిణులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: లయన్స్ క్లబ్ సభ్యుడు మనోహర్ రెడ్డి సహకారంతో పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు, వృద్ధులు, గర్భిణులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలోలయన్స్ క్లబ్ అధ్యక్షులు కల్కి సతీష్, డిస్ట్రిక్ట్ చైర్మన్ మారం విష్ణు, సభ్యులు వలీబాషా, ధనుంజయ, మహేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న ఉపసర్పంచ్

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతపేటకు చెందిన సుదర్శన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీదారుడు కావడంతో పథకం ద్వారా రూ. లక్ష బీమా వర్తించింది. తక్షణ సాయంగా ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మృతుని భార్యకు సోమవారం రూ.10 వేలు నగదు అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమ అవుతుందని రెండవ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రోషిరెడ్డి తెలిపారు.

చెగువేరాను స్ఫూర్తిగా తీసుకోవాలి



చెగువేరా చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



చెగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు

డోన్ రూరల్: యువత చెగువేరాను ఆదర్శంగా తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు సూచించారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ అర్జెంటీనాలో జన్మించిన చేగువేరా క్యూబా విముక్తి పోరాటంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్, నాయకులు వరదరాజులు, మధు, రామ్మోహన్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం చెగువేరా వర్ధంతి నిర్వహించారు. చెగువేరా చిత్రపటానికి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివకేశవ, మండల నాయకులు బంగారప్ప, వంశి, అశోక్, నవీన్, ప్రసాద్, అసీం, హేమంత్, కంబగిరి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విప్లవ వీరుడు చెగువేరా

బేతంచెర్ల: విప్లవ వీరుడు చెగువేరాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణంలో చెగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు ఎల్ల క్రిష్ణ, శ్రీకర్, దిలీప్, భాస్కర్, హరి, ప్రదీప్, మనోహర్, శరత్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య సోమవారం తెలిపారు. పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మధుమౌనికతో పాటు పలువురు ప్రముఖ వైద్యులు హాజరవుతారన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలుగొట్లలో..

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జోళదరాశి, కలుగొట్ల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చింతలాయపల్లెలో..

కొలిమిగుండ్ల: మండలంలోని చింతలాయపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. ప్రత్యేక వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆల్వకొండలో..

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం ఆల్వకొండలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సీనియర్ వైద్యులు, వైద్య బృందం గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ఆల్వకొండ, రెడ్డిపల్లె గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శరన్నవ రాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి



అమ్మవారి ఉత్సవాల పుస్తకాలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారి శాలలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల మోహన్‌రావు, గురవయ్య, ట్రెజరర్ గుండా జయ చంద్రయ్య కోరారు. సోమవారం అమ్మవారి శాలలో శరన్నవ రాత్రి ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈనెల 15న రాజరాజేశ్వరి, 16న పార్వతి దేవి, 17 అన్నపూర్ణాదేవి, 18 మధుర మీనాక్షి, 19 మహాలక్ష్మి దేవి, 20న సరస్వతి దేవి, 21 మహిషాసుర మర్ధిని, 22 సంతాన లక్ష్మి, , 23 విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వారు తెలిపారు. అక్టోబర్ 21న దుర్గాష్టమి, 23న విజయదశమి, 24న సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి గ్రామోత్సవం, 25న వసంతోత్సవం, వనభోజనం, రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కొప్పరపు శేషమోహన్, బచ్చు సుబ్రమణ్యం సముద్రాల మద్దిలేటిస్వామి,విష్ణు, రాజేంద్ర, బళ్లా నిసూర్య, గుప్త, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి



మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

డోన్ రూరల్: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కేవలం రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం స్పందించి బోగీలను పెంచేలా చూడాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రైల్వే జంక్షన్ మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో బంద్ అయినటువంటి ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలన్నారు. వందేభారత్ రైల్ చార్జీలను తగ్గించాలని, రైల్వే శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్‌యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రతాప్, బొంతిరాళ్ల గ్రామ సర్పంచ్ రవిమోహన్, ఏఐవైఎఫ్ నాయకులు విజయ్ రాఘవేంద్ర, దివాకర్, మనోజ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాబ్రియల్ ఫెలోపియోకు నివాళి



గాబ్రియల్ ఫెలోపియో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్: మానవ శరీర నిర్మాణ శాస్త్రవేత్త, ప్రముఖ వైద్యులు గాబ్రియల్ ఫెలోపియో వర్ధంతి సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ఆయనకు సోమవారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ హనీఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించి, వైద్యరంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆర్‌కె రెడ్డి, సోహెల్, గౌస్, ముజ్మిల్, సుకుమార్, కళ్యాణ్‌తో పాటు సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలా అకాడమీ విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీన జరిగిన బాక్సింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో రంజాన్ షరీ ఫ్, అనుమల్లా జైర్, అశ్విన్, సీనియర్ విభాగంలో బాలురు అబూస్ పియాన్, తౌఫిక్, మదన్ సుగుమారెడ్డి, జోహెబ్, బాలికల సీనియర్ విభాగంలో మౌనిక, అఫియా, ప్రియాంక, సుహన, నాగమల్లేశ్వరి, దీపిక, చరణ్యలు ప్రతిభ చాటినట్లు తెలిపారు. వీరిని పాఠశాల కోచ్ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పెళ్లీడు రాకుండా బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) శారద అన్నారు. సోమవారం పట్టణంలోని బర్న్ కాన్ఫరెన్స్ హాల్‌లో బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శామ్యూల్ దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడంపై జరిగే అనర్థాలను బాల బాలికలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, లైంగిక అసమానతలకు తావు లేదన్నారు. సీడీపీఓ లీలావతి మాట్లాడుతూ సమాజంలో వస్తున్న సమస్యలను ఎదుర్కోవడంలో బాలికల్లో మనోధైర్యం రావాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మదర్‌సొసైటీ సీఈఓ రామారావు, వరల్డ్ విజన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జెస్సి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల తనిఖీ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామాలలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలను డీఈ కృష్ణారెడ్డితో కలిసి సెంట్రల్ ఆడిట్ థర్డ్ పార్టీ ఆఫీసర్ బాలాజీరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. జగనన్న కాలనీలలో వారు పర్యటించి బిల్లులు మంజూరైన గృహాలు పూర్తయ్యాయా, లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందని, త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు, వర్క్ఇన్స్పెక్టర్ హాజీవలి తదితరుల పాల్గొన్నారు.

కోలుకోలేక లైన్‌మన్ మృతి

నంద్యాల(అర్బన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన అయ్యలూరు గ్రామానికి చెందిన లైన్‌మన్ సుబ్బారెడ్డి సోమవారం మృతి చెందాడు. రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయ పరిధిలోని అయ్యలూరు గ్రామంలో ఈనెల 1న మీటర్లకు రీడింగ్ స్కాన్ చేసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శాంతిరాం జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సుబ్బారెడ్డి మృతి చెందాడు.

మహిళకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): దారిన పోయే వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పౌరులకు ఇబ్బంది కలిగించిన ఓ మహిళకు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నిమ్మర్తి నగర్‌కు చెందిన కోల మేరి ఎన్‌జీఓ కాలనీ వద్ద దారిన పోయే వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో కొందరు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితురాలిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి, సెకెండ్ క్లాస్ కోర్టులో జడ్జి ముందు హాజరు పరచారు. జడ్జి ఆమెకు 8 రోజులు జైలు శిక్ష విధించారు.

వృద్ధురాలి అదృశ్యం

వెల్దుర్తి: స్థానిక రాణితోటకు చెందిన నారాయణమ్మ (65) ఆదివారం సాయంత్రం నుంచి అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో జరిగిన చిన్న గొడవ వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అందులో పేర్కొన్నాడు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఎక్కడైనా ఆమెను గుర్తించిన వారు 91211 01118, లేదా 100కు కాల్‌చేసి సమాచారం తెలపాలని కోరారు.

సర్వర్ సమస్యలు తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

సంజామల: ఎండీయూ వాహనాలు ద్వారా ఇంటింటికి వెళ్లి రేషన్ అందిస్తున్న సమయంలో సర్వర్ ఇబ్బందులు వస్తున్నయాని ఆపరేటర్లు ఆవేదన వక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ మల్లికార్జున రావును కలిసి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ వైద్యులపై స్పందనలో ఫిర్యాదు

డోన్ టౌన్: నంద్యాలలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లపై ఫిర్యాదు చేసినట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ సోమవారం తెలిపారు. డోన్ ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు రోగులకు, గర్భిణులకు సరైన సేవలు అందించకుండా లేనిపోని అనుమానాలను చెప్పి, భయభ్రాంతులకు గురి చేస్తూ సొంత ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లాలని రెఫర్ చేస్తున్నట్లు ఆరోపించారు. మరికొంత మంది కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకుని అక్కడికి పంపుతున్నారన్నారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు శ్రీకాంత్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి రామలింగ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



క్యూరింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామ పంచాయతీలోని వివిధ కాలనీలలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యి వాటర్ క్యూరింగ్‌లో ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్ల వేయాలని ప్రజలు విన్నవించడంతో ఆయన నిధులు మంజూరు చేయించారు. మైనార్టీ కాలనీ, సచివాలయ, దస్తగిరిస్వామి దర్గా సమీపంలో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయని, వాటర్ క్యూరింగ్ పూర్తయిన వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల రామచంద్రారెడ్డి తెలిపారు.

ఈ- పంట నమోదుతోనే ప్రభుత్వ పథకాలు

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ కింద సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ- క్రాప్, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని నంద్యాల ఏఓ ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సోమవారం మండలంలోని మిట్నాల ఆర్బీకేను సందర్శించారు. ఏఓ మాట్లాడుతూ నంద్యాల మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు 19 వేల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 15 వేల ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయిందన్నారు. అదే విధంగా 13 వేల ఎకరాల్లో ఈ -కేవైసీ చేయించుకున్నారని మిగిలిన రైతులు ఈ -కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన విక్రాంత్, అశోక్

పత్తికొండ రూరల్: పత్తికొండ బైపాస్ రోడ్డులోని మలకలకుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. విక్రాంత్ పొలం పనులకు వెళ్లి తిరిగి పొలం రస్తా నుంచి బైపాస్ రోడ్డుపైకి వస్తున్నాడు. అదే సమయంలో బేల్దారి అశోక్ బైపాస్ రోడ్డులో బైక్‌పై వేగంగా వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సనందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.